“చేసిందంతా చేసి నీ తప్పేం లేదంటావేం?” అంటూ మెహెక్ వైపు చూస్తూ..

“మరెవరి తప్పు?”.. మళ్లీ అడిగాడు విశ్వనాథ్.

విశ్వనాథ్ కోపానికి బెదిరిపోయిన మెహక్, ఒక్కసారిగా ఏడుపాపేసి.. బేలగా దిక్కులు చూస్తూ గుటకలు మింగడం మొదలుపెట్టింది. చివరికి రామ్లానే ధైర్యం కూడగట్టుకుంటూ అన్నాడు..

“తప్పెవరిదైనా ఫలితం మాత్రం తనే అనుభవించాల్సార్! చిన్నప్పట్నుంచీ ప్రేమిస్తున్నాను. చివరిదాకా ప్రేమిస్తూనే ఉంటాను”..

రామ్లా మాటల్లోని ప్రేమ విశ్వనాథ్‌ను కట్టిపడేసింది. అతను ఎంచుకున్న పరిష్కారం తప్పే కావచ్చు. కానీ సమస్య పరిష్కారానికై పడుతున్న తపనలో నిజాయతీ ఉంది. అతని వైపునుంచి చూస్తే ఆ పరిష్కారం చాలా ఉన్నతమైనది – ఉదాత్తమైనది. కానీ, భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను అంచనా వెయ్యకుండా ప్రేమావేశంతో తీసుకునే నిర్ణయాలు సరైన పరిష్కారాలను ఇవ్వలేవు.

జీవితం ప్రేమనివ్వచ్చు.. కానీ ప్రేమ జీవితాన్నివ్వలేదు. ఈ విషయం రామ్లా సున్నిత హృదయానికి అర్థమయ్యేలా చెప్పాలి. అందుకే సోఫాలోంచి కిందికి వచ్చాడు విశ్వనాథ్. వారి ముందు కూర్చున్నాడు. ఇద్దరినీ రెండుచేతులా దగ్గరికి తీసుకున్నాడు.

“నీ నిర్ణయం చాలా గొప్పది రామ్లా. కానీ, పెళ్లి మాత్రమే దానికి పరిష్కారం కాదు. ఇంత చిన్నపిల్ల గర్భాన్నెలా మోస్తుంది? పిల్లల్నెలా కంటుంది? ఒకవేళ కన్నా.. పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందనే గ్యారెంటీ ఏమిటి? అయినా పెళ్లిద్వారా సమస్యలు కొని తెచ్చుకోవడం కంటే అబార్షన్ చేయించడమే మంచిది” అన్నాడు.

ఆ మాట వినగానే అంతర్మథనంలో పడ్డాడు రామ్లా. కొంతసేపు ఆలోచించుకున్నాక తనుకూడా విశ్వనాథ్‌తో ఏకీభవిస్తున్నట్లుగా అన్నాడు..

“ఇప్పుడాలోచిస్తే నాకూ అబార్షనే మంచిదనిపిస్తున్నది సార్! అయినా సరే.. మా పెళ్లి మాత్రం ఆగదు!”.

రామ్లా ధోరణి చాలా విచిత్రంగా అనిపించింది. అందుకే కోపంగా చూస్తూ అడిగాడు విశ్వనాథ్..

“అంటే.. తప్పు నీదేగా?”.

ఆ మాట వినగానే ఒక్కసారిగా పైకి లేచాడు రామ్లా..

“లేద్సార్. నేనే తప్పూ చెయ్యలేదు. తను అమాయకురాలు సార్! దానికేం తెలియదు. తెల్లగా ఉంటే పాలు.. నల్లగా ఉంటే నీళ్లు అనుకుంటుంది. ఇలాంటి అమాయకురాళ్ల కోసం మాటేసే వేటకుక్కలకేం తక్కువ లేద్సార్! ఎవడో వస్తాడు.. మాయమాటలు చెబుతాడు. చాక్లెట్లో కూల్‌డ్రింక్సో కొనిపెట్టి.. ‘ఫ్రెండ్‌షిప్!’ అంటాడు. ‘నిన్ను నా కంటే ఎవడూ బాగా చూసుకోలేడు!’ అని నమ్మిస్తాడు. ఏవో పోర్న్ సైట్లు చూపిస్తాడు. అదేం తప్పుకాదని ఒప్పిస్తాడు. చివరికి నట్టేట్లో ముంచేసి పోతాడు. ఇంకెవడో వస్తాడు. వేరెవరికో తారుస్తాడు. మరెవడో వస్తాడు.. ఇంకెవడికో అమ్మేసి పోతాడు. గూడాలంటే అందరికీ అలుసే! వీలైనప్పుడల్లా గూడాల్లో స్త్రీలకు కౌన్సెలింగులు ఇప్పించే మీకివన్నీ తెలియని విషయాలు కావుసార్”.. అంటుంటే సాలోచనగా తల పంకించాడు విశ్వనాథ్.

రామ్లా కొనసాగించాడు..

“ఇలాంటిది సిటీలో జరిగితే వెంటనే పేపర్లు, టీవీలవాళ్లొస్తారు. నానా యాగీ చేస్తారు. న్యూస్ ఛానెల్స్ నిండా డిస్కషన్లు – డిబేట్లు జరుగుతాయి. ఈలోగా ఇంకో కొత్త వార్తొస్తుంది. పాతవార్త పోతుంది. జనం అన్నీ మర్చిపోతారు. కానీ, ఊళ్లలో ఎంతమాత్రం మర్చిపోరు సార్. రోజూ ఎవరో ఒకరు సూటిపోటి మాటలు అంటూనే ఉంటారు. పుండుమీద కారం చల్లుతూనే ఉంటారు. గూడాల్లో, తండాల్లో, మారుమూల పల్లెల్లో ఎక్కడ చూసినా ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. అందుక్కారణం చెడిపోయే మార్గాలన్నీ చదువుకునేవాళ్ల చేతిక్కూడా అందుబాట్లోకి రావడమే సార్. చూడండి సార్.. చూడండి. చదువుకున్న ఆటవికుల కిరాతకం” అంటూ నెల కిందటి మెహక్ ఫొటో చూపించాడు. అందులో ఆమె ఒంటినిండా కట్లూ.. గాయాలే!

“ఒక్కడు కాద్సార్! ఇద్దరు. కాళ్లూచేతులూ కట్టేసి.. కుక్కలకంటే హీనంగా కలబడుతున్నా సరే ప్రాణాలు నిలబెట్టుకుందంటే.. గ్రేట్ సార్. మెహక్ చాలా గ్రేట్. అందుకే హాస్పిటల్‌కు తీసుకెళ్లేవరకూ చావుతో పోరాడి గెలిచింది” అని చెబుతుంటే విశ్వనాథ్ గుండెలవిసిపోయాయి.

రామ్లా భుజం మీద చెయ్యేశాడు విశ్వనాథ్.

“ఆసుపత్రికి తీసుకెళ్లి మంచిపని చేశావు. మరి అప్పుడే మెడికల్ టెస్టుకు ఎందుకు పంపలేదు?”.

“పంపితే ఏమౌతుంద్సార్?”.

“తప్పు చేసిందెవరో తెలుస్తుంది. వారి నేరాన్ని నిరూపించి శిక్షపడేలా చెయ్యవచ్చు”.

“శిక్షపడాలంటే మైనర్లు వివాహం చేసుకోకూడదని చట్టం చేస్తే చాలదు సార్. మైనర్లు రేపులు చెయ్యకుండా కట్టడి చెయ్యాలి. క్రిమినల్స్‌గా మారకుండా చూడాలి. వాళ్లు దారి తప్పకుండా చూసుకోవాల్సిన బాధ్యత తీసుకోవాల్సింది ఎవరు? తల్లిదండ్రులు! వాళ్లు పట్టించుకోకపోతే ఇలాగే జరుగుతుంది. కానీ, చట్టాలు చెయ్యలేని పని.. భర్త చెయ్యగలడు సార్! అందుకే.. ఆడపిల్లల రక్షణకోసమే బాల్యవివాహాలు మొదలయ్యాయి. పూర్వకాలంలో విదేశీ దండయాత్రలు జరిగినప్పుడు అవివాహితులందర్నీ ఎత్తుకుపోయేవారంట సార్. కన్యలను చెరిస్తే వచ్చే సుఖం గొప్పదనుకునే కుక్కలు వాళ్లు. అందుకే ఆ కామాంధుల బారినుంచి కాపాడుకోవడం కోసం పిల్లలకు చిన్నతనంలోనే పెళ్లిళ్లు చేసేవారు. అయినప్పటికీ ఎవరైనా స్త్రీని చెరబట్టాలని వస్తే.. వారినుంచి భర్తే కాపాడుకునేవాడు. అతనికి కుటుంబం, బంధువర్గం, కులం అన్నీ అండగా ఉండేవి. అది చదువు సంధ్యల్లేని సమాజం. అప్పుడలా జరగడం తప్పు కాకపోవచ్చు. కానీ ఇది చదువుకున్న అత్యాధునిక సమాజం. ఇక్కడ అందరూ విద్యావంతులూ, మేధావులూ, సంస్కారవంతులే! కానీ అందరూ హక్కుల గురించే తప్ప ఎవరూ బాధ్యతల గురించి మాట్లాడరు!! అందుకే స్త్రీల భద్రత విషయంలో అప్పటికీ ఇప్పటికీ ఏమాత్రం తేడాపోలేదు. అందుకే సార్! అందుకే.. వాళ్లబారినుంచి ప్రేమను కాపాడాలనుకుంటున్నాను”.

రామ్లా మాటల్లో ఏ ఒక్కటీ అబద్ధం కాదని విశ్వనాథ్‌కు తెలుసు. అలాగని అతను మెహక్‌ను పెళ్లిచేసుకోవడానికి ఎంతమాత్రం అంగీకరించలేడు. అందుకే..

“చూడు రామ్లా! నేను నేరస్థులకు శిక్షవెయ్యడం గురించి చెబుతుంటే నువ్వు నీ పెళ్లి గురించి మాట్లాడుతున్నావు. దీనికీ దానికీ సంబంధం ఏమిటి? అయినా ఆమెకు అన్యాయం చేసినవాళ్లకు శిక్షపడేలా చెయ్యడం మానేసి.. పెళ్లంటావేం?” అంటూ నిలదీశాడు.

“శిక్షించలేరు సార్! అందరూ అందర్నీ శిక్షించలేరు. మీలాంటివాళ్లు మాలాంటివాళ్లను పైకి తీసుకురావడం కోసం జీవితాల్ని అంకితం చేస్తారు. మీకంటే మీ పిల్లల్ని గొప్పవాళ్లుగా చెయ్యాలని కోరుకుంటారు. కానీ, వాళ్ల స్కూలెగ్గొట్టి చేసే అరాచకాలు అన్నీ ఇన్నీ కాద్సార్!”.

రామ్లా మాటల్ని వింటూనే తన అనుభవాలను బేరీజువేసుకుంటూ ఆలోచిస్తున్నాడు విశ్వనాథ్.

మంచిలో చెడు ఉన్నట్లే.. చెడులో కూడా కొంత మంచి ఉండవచ్చు. ఆ కొద్దిపాటి మంచికోసం సమాజానికి తప్పుడు సంకేతాలిచ్చే నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. రామ్లా పరిస్థితికి పెళ్లే ఆదర్శవంతమైన పరిష్కారంలా కనిపించవచ్చు. కానీ, ఆదర్శాలు ఆద్యంతమూ చిక్కగానే ఉండవు. పరిస్థితులనుబట్టి మరింత గట్టిపడవచ్చు లేదా పలచబడిపోవచ్చు. రెండోది జరిగితే మెహక్ పెళ్లికి ముందే పాడైపోయిందనే ఆలోచన అతని మనసును తొలిచేస్తుంది. అది మెహక్ జీవితాన్ని నరకంగా మార్చేస్తుంది. అందుకే అన్నాడు విశ్వనాథ్..

“అవును. మన చదువులు కూడా విలాసవంతంగా మారిపోయి పిల్లల్ని సమాజ కంటకులుగా తయారు చేస్తున్నమాట కొంతవరకూ నిజమే కావచ్చు. కనీసం దాన్ని నిరూపించడానికైనా సాక్ష్యాధారాలు ఉండాలిగా?”.

“ఆధారాల కోసం వైద్య పరీక్షలే అవసరంలేదు సార్! ఒక్కోసారి నేరస్థులెవరో తెలిసినా ఎవరూ ఏమీ చెయ్యలేరు. న్యాయానికి నిలబడ్డమనేది న్యాయం గురించి మాట్లాడినంత సులభం కాద్సార్. మీలాగే మీ పిల్లలు కూడా బాగా చదువుకుని గొప్పవాళ్లయి మీలాగే సమాజాన్ని ఉద్ధరించాలని కాస్ట్‌లీ కలలుగంటూ.. కాస్ట్‌లీ స్కూళ్లల్లో పడేసి చేతులు దులుపుకొంటారు. ఆ కాస్ట్‌లీ స్కూళ్లు.. అడ్డమైన కాస్ట్‌లీ అలవాట్లూ నేర్పుతాయి”.. అంటూ ఒక ఫొటో తీసి విశ్వనాథ్ చేతిలో పెట్టాడు రామ్లా.

అందులో మెహక్ మీద దాడిచేస్తున్న ఇద్దరిలో ఒకడు.. ఎక్కడో స్కూల్లో ఉండాల్సిన తన కన్న కొడుకు! వాణ్ని ఆ ఫొటోలో చూడగానే దిగ్భ్రాంతుడయ్యాడు విశ్వనాథ్.

అతడలా నిశ్చేష్టుడై చూస్తుండగానే..

“మమ్మల్ని ఎవరూ కాపాడలేరు సార్! అందుకే మమ్మల్ని మేమే కాపాడుకుంటాం” అంటూ జేబులోంచి తాళిబొట్టు తీసి, మెహక్ మెడలో కట్టేశాడు రామ్లా. ■


**జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి**



తెలుగు, కన్నడ రెండు భాషల్లో సాహిత్య సేవచేస్తూ.. మూడు రాష్ట్రాల్లో పాఠకాభిమానులను సంపాదించుకున్నారు జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి. ఈయన స్వస్థలం భీమవరం. ప్రస్తుతం చిత్తూరు జిల్లా పలమనేరులో స్థిరపడ్డారు. తల్లిదండ్రులు జొన్నవిత్తుల లక్ష్మీ నరసమ్మ – రామకృష్ణశర్మ. పదో తరగతి చదివారు. ఈటీవీలో కన్నడ రచయితగా, మాటీవీలో తెలుగు రచయితగా 30 ఏళ్లు పనిచేశారు. ఆయా చానెళ్లలో డైలీ సీరియల్స్ కోసం వేలాది ఎపిసోడ్‌లకు డబ్బింగులు రాశారు. సాహిత్యంపై అభిలాషతో వందకుపైగా కథలు రాయగా.. దాదాపు నలభై కథలకు బహుమతులు అందుకున్నారు. ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్, ఈ కథకు శిల్పంలేదు, నూటొకటో మార్కు(సిలబస్‌లో లేని చదువుకథలు) కథా సంపుటాలను వెలువరించారు. 1997లో అమెరికన్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన తొలి నవలల పోటీలో.. ‘వలసదేవర’కు మొదటి బహుమతి దక్కించుకున్నారు. ఇంకా అనేక బహుమతులు, అవార్డులు అందుకున్నారు.